

## శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేదు

### -ఈస్టు ఇన్‌ఛార్జి సిఐ రామకిశోర్

తిరుపతి, మే 18ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలో అత్యంత కీలకమైన తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యంత ప్రధానమైన యాత్రికుల రద్దీప్రాంతాలున్నాయని, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేని ధోరణితో పనిచేస్తానని ఈస్ట్ ఇన్‌ఛార్జి సిఐ పివిఎస్ రామకిశోర్ తెలిపారు. పోలీస్ సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, పగలు,రాత్రి గస్తీలను పటిష్టంగా అమలుచేయాలన్నారు. ముఖ్యంగా ఆర్టీసి బస్టాండు, రైల్వేస్టేషన్, టిటిడి పరిపాలన భవనం, యాత్రికుల వసతి సముదాయాలు ఉండటంతో వేసవిసెలవుల్లో యాత్రికుల రద్దీకి తగ్గట్లు భద్రత పై దృష్టి సారిస్తానన్నారు. ఎక్కడా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సిఐ కిశోర్ సిబ్బందికి సూచనలు చేశారు. పోలీసులు నిరంతరం అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సిఐ తెలిపారు. ఈస్ట్ ఇన్‌ఛార్జి సిఐగా సోమవారం రామకిశోర్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది, ఎస్ఐలు అభినందనలు తెలిపారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం
30 వార్త వార్షికోత్సవం
1996 - 2026

## రేపు సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన

కుప్పం, మే 18 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఈనెల 20వతేది కుప్పంలో పర్యటించనున్నారు. 20వతేది బుధవారం ఉదయం 9గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరి 11 గంటలకు శాంతిపురం మండలం తుమ్మిశి వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజలనుంచి వినతులు స్వీకరించాక శాంతిపురం మండలం శివపురంలోని స్వగృహం చేరుకుంటారు. మధ్యాహ్నం 12గంటలకు కుప్పంలోని శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయానికి సిఎం చంద్రబాబునాయుడు, సిఎం సతీమణి నారా భువనేశ్వరి చేరుకు ంటారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1గంటలకు శివపురం స్వగృహంకు చేరుకుంటారు. 3గంటలకు తుమ్మిశి హెలి ప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో బెంగళూరు బయలుదేరుతారు. సాయంత్రం 4.30గంటలకు బెంగళూరు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటరే ్నషనల్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంకు హాజరై రాత్రి 10.20గంటలకు మరలా ఉండవల్లి నివాసంకు చేరుకు ంటారు.

### తండ్రి కష్టాన్ని, తల్లి ఆవేదనను

# అర్ధం చేసుకోవాలి!

### పోలీసుల పిల్లలకు అవార్డులు: హోం మంత్రి అనిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వంగల పూడి అనిత

శ్రీకాళహస్తి,మే 18 ప్రభాతవార్త

పోలీసు ఉద్యోగం ఎంతో క్లిష్టమైనదని 24 గంటలు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు కీలకమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగల పూడి అనిత అన్నారు. సోమవారం శ్రీకాళహస్తిలోని డిబిఆర్ ఫంక్షన్ హాలులో జిల్లాలోని పోలీసుల పిల్లలు పది,ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు సన్మానం కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా సమావేశానికి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సభలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి,రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడులు హాజరయ్యారు.ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి వంగల పూడి అనిత మాట్లాడుతూ అవార్డు ఎంతన్నది కాదు. ఇదో గుర్తింపు, ప్రోత్సాహకం అన్నారు. వృత్తి రీత్యా పోలీసు ఉద్యోగంలో చేరిన ఉద్యోగి బందోబస్తు సందర్భంగా పడే బాధలు అన్ని ఇన్ని కాదన్నారు. ఎండనక,వాననక, ఎక్కడో చెట్టునీడన ఉంటూ ఏదో ఇచ్చిన ఆహారం పొట్టం తింటూ శాంతి భద్రతల పరిరక్షణకు పాటు పడుతుంటారన్నారు. ఇవన్నీ ఎందుకు చేయాలి? అంటే తమ బిడ్డల భవిష్యత్తు కోసం అని గుర్తించుకోవాలన్నారు. బిడ్డల అభ్యున్నతికి తల్లి దండ్రుల పడే ఆగచాట్లను గుర్తించుకోవాలన్నారు.తాను తన సుఖాన్ని పణంగా పెట్టి బిడ్డల కోసం పడుతున్న ఆరాటాన్ని బిడ్డలు గుర్తించాలన్నారు. వారికష్టాన్ని గుర్తుపెట్టుకొని బాగా చదవి ఉన్నత స్థాయికి వస్తే తాను పడ్డ కష్టం బాధలను మరచిపోతారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ నేడు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కృషితో పోలీసు వ్యవస్థలో పలు మార్పులు చేర్పులకు శ్రీకారం చుట్టారన్నారు.అంతేకాక పోలీసు వ్యవస్థను ప్రోత్సహించుటకు వారి పిల్లలకు సన్మానాలు ఏర్పాటు చేయటం ఆ శాఖపట్ల ప్రభుత్వ గుర్తింపుకు నిదర్శనం అన్నారు.

### రాష్ట్రానికి తిరుపతి జిల్లా అదర్శం కావాలి!

జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు తీసుకున్న ఈ నిర్ణయం మహోన్నత మైందన్నారు. అది శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు.రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తిరుపతి జిల్లా ఆదర్శవంతం కావాలని, మార్గ దర్శకం కావాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.నేడు కూటమి ప్రభుత్వం ఎన్నో సంస్కరణలతో ప్రజలకు సుపరిపాలన అందించుటకు ప్రణాళికలతో ముుందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్,శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో ఇంటి పట్టాల పంపిణీ

### శెట్టిపల్లి ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రులు అనగాని సత్య ప్రసాద్, పి.నారాయణ

తిరుపతి కార్పొరేషన్, మే 18 ప్రభాతవార్త:

శెట్టిపల్లి ప్రాంతంలో ఇంటి పట్టాల పంపిణీ, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, పి.నారాయణ పేర్కొన్నారు. సోమవారం తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో శెట్టిపల్లి ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రుల సమక్షంలో లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు పురపాలక శాఖ మంత్రి పొంగులేటి నారాయణ, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, శ్రీకాళహస్తి, చంద్రగిరి, గూడూరు, సూళ్లూరుపేట, నగరి ఎంఎల్‌ఏ లు బి.సుధీర్ రెడ్డి, పులివర్తి నాని, పాసం సునీల్ కుమార్, డా. విజయశ్రీ, గాలి భాను ప్రకాశ్, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్య మని, పేదల సంక్షేమం, గృహ నిర్మాణం, మౌలిక వసతుల అభి వృద్ధి, జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్ర మాలను అమలు చేస్తోందన్నారు. శెట్టిపల్లి ప్రాంతంలో అర్హత కలిగిన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించి ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. భూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించి పేదలకు హక్కులు కల్పించడంలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఇంటి స్థలం మాత్రమే కాకుండా అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలను కూడా దశలవారీగా అభివృద్ధి చేస్తామ న్నారు. రాష్ట్ర మున్సిపల్ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ దాదాపు 70 సంవత్సరాలు పైగా శెట్టిపల్లి భూ సమస్య 2014 సం. లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి రాగా సమ స్యను వెంటనే పరిష్కరించాలని





ఆదేశించగా సర్వే చేయడం జరిగిందన్నారు. దీని ఫలితంగా శెట్టిపల్లికి చెందిన 2,048 లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఈ సమస్య కు పరిష్కారం అందించిన ముఖ్యమంత్రి స్థాయి నుండి మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ శెట్టిపల్లి ప్రజల దశాబ్దాల కష్టానికి రాష్ట్ర ప్రభుత్వం ముగింపు పలుకుతూ భూ సమస్యను పరిష్కరించిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో 2018లో ప్రారంభమైన ఈ సమస్య ఎనిమిది సంవత్సరాల తర్వాత విజయవంతమైందన్నారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు, తుడా ఛైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు అందరూ కలిసి కృషి చేయడం వల్లే ఈరోజు ప్రజలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందించగలిగామన్నారు. తుడా ఛైర్మన్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథం లో నడిపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి వర్గం, తిరుపతి జిల్లా ఎం ఎల్ ఏ లు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర ప్రజా ప్రతి నిధులు, తుడా అధికారులు, ఇతర సంబంధిత అధికారుల సహకా రంతో శెట్టిపల్లి భూ సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. శెట్టిపల్లి సమస్య 1979 లో ప్రారంభం అయ్యిందని, ఈ సమస్య 2017 సంవత్సరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి వెళ్ళిన తరువాత 2018 సంవత్సరంలో ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. 2025 సెప్టెంబర్ లో అధికారికంగా క్యాబినెట్ లో ఆమోదించడం జరిగిందన్నారు. భూ రిజిస్ట్రేషన్ ఫీజు భరించలేమన్న పేదవర్గాల వారి వినతిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళగా 2026 నూతన సంవత్సరం కానుకగా సుమారుగా రూ.17.50 కోట్ల రిజిస్ట్రేషన్ ఫీజును మాఫీ చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా జనవరి 15న ఈడిప్ లాటరీ విధానంలో పారదర్శకంగా ప్లాట్ ల కేటాయింపు చేపట్టామన్నారు. రోడ్లు, డ్రైనేజి, త్రాగు నీరు వంటి మౌలిక సదుపాయాలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నరసింహ యాదవ్, టిటిడి బోర్డు మెంబర్ డా. పనబాక లక్ష్మి, ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.సుగుణమ్మ, జాయింట్ కలెక్టర్ మరియు తుడా విసి ఆర్.గోవిందరావు, ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మండలి ఛైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు, మాజీ మంత్రి డా. పరసారత్నం, ఏపీ హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ డా.పి. హరిప్రసాద్, వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సి.ఆర్. రాజన్, ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ ఆర్ .సదాశివం, శెట్టిపల్లి గ్రామ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

### పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై

# చిత్తూరులో వైకాపా వినూత్న నిరసన



చిత్తూరు, మే 18 ప్రభాతవార్త:

పెంచిన పెట్రోల్, డిజీల్ ధరలను సత్వరం తగ్గించాలని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త ఎంసి విజయానందరెడ్డి డిమాండ్ చేశారు. వైకాపా అధిష్టానం పిలుపు మేరకు చిత్తూరులో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో పెట్రోల్, డిజీల్ ధరల పెంపుకు నిరసనగా వైకాపా నాయకులు, కార్యకర్తలు సోమవారం ర్యాలీ, ధర్నా కార్యమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు చిత్తూరు గాంధీ విగ్రహం నుండి ఎంఎస్ఆర్ సర్కిల్, అర్డీఓ కార్యాలయం వరకు ఆటోను తాడు కట్టి లాక్కొంటూ పెంచిన పెట్రల్, డిజీల్ ధరలు సత్వరం తగ్గించాలని నినాదాలు చేశారు. చిత్తూరు అర్డీఓ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాను ఉద్దేశించి ఎంసి విజయానందరెడ్డి మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే పెట్రోల్, డిజీల్ ధరలు తగ్గిస్తామని కుప్పంలో హామీ ఇచ్చిన మంత్రి నారా లోకేష్ ప్రస్తుతం వున్న పెట్రోల్, డిజీల్ ధరను తగ్గించకుండా మరింత పెంచడం ప్రజలపై మరితం భారం పడిందన్నారు. మన రాష్ట్రంలో కంటే తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో పెట్రోల్, డిజీల్ ఒక లీటరుపై రూ.10 నుండి రూ.8 వరకు తక్కువగా లభిస్తుందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం చర్యలు తీసుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెట్రోల్, డిజీల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, వైకాపా మహిళా నాయకురాలు గాయత్రిదేవి, వైకాపా నాయకులు జ్ఞానజగదీష్, పెద్ద ఎత్తున వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీ ముత్తుమారెమ్మ

# అగ్నిగుండ ప్రవేశం

### - పోటెత్తిన భక్తులు.. గట్టి పోలీసు బందోబస్తు !!



కుప్పం, మే 18 ప్రభాతవార్త





జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి జాతరలో భాగంగా సోమవారం శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అమ్మవారి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి కూతవేటు దూరంలో పాత పోలీస్ క్వార్టర్స్ ఉన్న స్థలంలో గుండంను ఏర్పాటుచేశారు. మొక్కులు కలిగిన భక్తులు నిప్పుల కణికలు తొక్కుతూ అమ్మా గంగమ్మా కాపాడమ్మా అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఆలయం వద్ద, అగ్నిగుండం వద్ద పోటెత్తారు. అగ్నిగుండం వీక్షించుటకు గాను భక్తులకు అసౌకర్యం కలగకుండా పెద్ద ఎత్తున బ్యారికేడ్లను ఏర్పాటుచేశారు. తొలుత పచ్చిగెరిగను ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం శ్రీ ముత్తుమారెమ్మ అమ్మవారి కళ్లకు తెర తొలగించిన అనంతరం అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు ఉదయం పాతపేటలోని పెద్దబావి వద్ద గంగపూజ చేపట్టారు. మధ్యాహ్నం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సంప్రదాయ బద్ధంగా అగ్నిగుండంకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి గుండంను వెలిగించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, రెస్కోఛైర్మన్ ప్రతాప్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. అగ్నిగుండం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు,సిబ్బందితో భారీబందోబస్తు నిర్వహించారు.

### భాకరాపేట ఘాట్‌లో

# గజరాజుల గర్జనలు





చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, మే 18 ప్రభాతవార్త:

తిరుపతి - మదనపల్లె జాతీయ రహదారిలోని భాకరాపేట ఘాట్ రోడ్‌లో ఆదివారం రాత్రి మూడు ఏనుగులు హల్చల్ చేయడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఘాట్ రోడ్డుపై ఏనుగులు సంచరిస్తుండటాన్ని గమనించిన వాహనదారులు ఎక్కడికక్కడ వాహనాలను నిలిపివేయడంతో సుమారు గంటపాటు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. రాత్రివేళ జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని వెంటనే అటవీశాఖ, పోలీసు శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు ఏనుగులను అటవీ ప్రాంతంలోకి తరిమివేసి అనంతరం వాహన రాకపోకలను పునరుద్ధరించారు. రాత్రి సమయంలో ఘాట్ రోడ్డులో గస్తీ నిర్వహించి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే నాని అధికారులకు సూచించారు. అయితే భాకరాపేట ఘాట్‌లో ఏనుగుల సంచారం కొత్త విషయం కాదని స్థానికులు మండిపడుతున్నారు. గతంలో కూడా ఒంటరి ఏనుగు రెండు రోజులపాటు ఘాట్ రోడ్డులో బీభత్సం సృష్టించగా, రెండు రోజుల క్రితం ఏనుగుల గుంపు పరిసర ప్రాంతాల్లో పంటలను పూర్తిగా ధ్వంసం చేసింది. అయినప్పటికీ అటవీశాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఏనుగుల కదలికలపై సమాచారం ఉన్నప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో ఘాట్ రోడ్డులో హెచ్చరిక బోర్డులు, ప్రత్యేక గస్తీ, అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేయకుండా నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి గజరాజుల సంచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని, లేదంటే ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో

# నాణ్యమైన పరిష్కారం చూపాలి..

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 301 అర్జీలు..
### జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్ ,మే 18 ప్రభాతవార్త :..



పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదే శించారు. సోమవా రం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో డి.ఆర్.ఓ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిరక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చు అర్జీలపై నిరక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, డి ఆర్ ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు భరత్ నాయక్, రోజ్ మాండ్ లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

# ఎవరికి వారే...!

ప్రభాతవార్త-తిరుపతి:

పేరుకే కూటమి పార్టీలు...కూటమి ప్రభుత్వంకొనసాగుతున్నా సిఎం చంద్రబాబు సొంత జిల్లాల్లో ఆయా పార్టీల్లో 30గ్రూపులు నడుస్తుండటం జనం నవ్విపోతున్నారు.కూటమిలోని టిడిపి, జనసేన,బిజెపి నేతలు ఎవరికివారే అన్నచందంగా వ్యవహరిస్తూ పార్టీలకు నష్టం కలిగిస్తున్నారనేది ఇప్పటికే ప్రజల్లోనేగాక పార్టీల నేతలకు కూడా విసుగుపుట్టింది. ప్రజాబలం ఉన్న నేతలు కూడా తిరుపతిలో వైసిపి నేతలను ఎదుర్కోవడంలో కూటమి నేతల విఫలమయ్యారు. టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడు పై వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపణలు చేసిన సమయంలో కూటమి నేతలు సమర్థవంతంగా తిప్పికొట్టలేక పోయారని అంటున్నారు. తాజాగా ఇద్దరు టిడిపి నేతలు కబ్జాలకు పాల్ప డుతున్నారంటూ వైసిపి నియోజక వర్గం ఇంచార్జి భూమన అభినయ్ రెడ్డి ధర్నా చేశారు. ఆ పార్టీ మహిళా విభాగం కార్య కర్తలు ఊరేగింపు చేశారు. టిడిపి మహిళా విభాగం వారితో ఎదురుపడి ఘర్షణకు దిగారు. ఈ నేపద్యంలో ఇద్దరు సీఐలను జిల్లా ఎస్పీ వీఆర్ కు పంపడం సంచలనంగా మారింది. దీంతో అధికార కూటమి నేతల తీరుపై నియోజక వర్గంలో చర్చ నడుస్తోంది. కూటమిలో ఉన్న మూడు పార్టీలు తొమ్మిది వర్గాలుగా చీలి పోయారని అంటున్నారు. అందులో మళ్ళీ ఉప వర్గాలు ఉన్నాయని జనం బహాటంగానే వ్యాఖ్యలు. జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మిగిలిన పార్టీలను పెద్దగా పట్టించుకోవడం లేదంటున్నారు. ఆఖరికి తమ పార్టీలోని వర్గాలకు దూరంగా ఉన్నారు. జనసేనలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ ఒక వర్గం, మాజీ నియోజక వర్గం ఇంచార్జి కిరణ్ రాయల్ మరో వర్గానికి నాయకత్వం వహిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే ఎవరికి దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్నారనేది ఆ పార్టీలోనే గుప్పుమంటోంది. తెలుగు దేశం పార్టీలో రెండు బలమైన వర్గాలు ఢీ అంటే ఢీ అనేలా ఉన్నారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్ తదితరులు ఒక వర్గంగా ఉన్నారు. వీరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా సై అంటున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా నియోజక వర్గం ఇన్‌చార్జి సుగుణమ్మ, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాల సుబ్రమణ్యం తదితరులు ప్రత్యర్థి వర్గంగా ఉన్నారు. సూరా సుధాకర్ రెడ్డి, మబ్బు దేవనారాయణ రెడ్డి, పరసా రత్నం, ఎన్ బి సుధాకర్ రెడ్డి ,వి.పుష్పావతియాదవ్ తదితరులు తటస్థంగా ఉన్నారు. బిజెపిలో టిటిడి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాటకొండ విశ్వనాథ్, వంప్రసాద్, పొనగంటి భాస్కర్, గుండాల గోపీనాథరెడ్డి ఇలా మరి కొందరు వేరు వేరు వర్గాలుగా వారిరీతిలో దూసుకు వెళ్తున్నారు. ఈ నేపద్యంలో కూటమి పార్టీల్లో వైసిపి నాయకులను ఎదుర్కొనే నాయకుడే లేదన్న బలమైన వాదనలు వినిపిస్తున్నాయి. మరీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళకే పరిస్థితి ఇలా ఉంటే త్వరలో రానున్న స్థానిక ఎన్నికల మాటమాత్రందేవుడెరుగు అన్నట్లు మారింది.

### మూడు పార్టీలు...
### తొమ్మిదిగ్రూపులు



# సిఎం చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలి

## - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మే 18 ప్రభాతవార్త



ఈనెల 20వతేది సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనను అధికారులు సమన్వయంతో పనిచేసి జయప్రదం చేయాలని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సిఎం పర్యటన ఏర్పాట్లపై కడ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ట్రైనీ ఎస్పీ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ సిఎం పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జాతర సందర్భంగా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ వసతులు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, రెస్కో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ జాతరకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఆలయం వెలుపల, లోపల, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపుకు చర్యలు చేపట్టామన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. సమావేశంలో కడ ఎపిడి శ్రీనివాసులురాజు, ఆర్డీఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి

- ఐరాల క్రాస్‌లో వైకాపా ధర్నా, రాస్తారోకో

తవణంపల్లి, మే 18 ప్రభాతవార్త:




రాష్ట్రంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను సత్వరం తగ్గించాలని పూతలపట్టు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఐరాల క్రాస్ వద్ద పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలకు నిరసనగా నియోజకవర్గ పరిధిలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తవణంపల్లి తహసిల్దారు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని ప్రజలపై భారీ మోపమని హామీ ఇచ్చారన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో పెట్రోల్, డీజిల్, విద్యుత్ ధరల అంశంపై తీవ్ర విమర్శలు చేసిన కూటమి నాయకులు నేడు అధికారంలోకి రాగానే యుద్ధ పరిస్థితులను అడ్డం పెట్టుకుని పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని దుయ్యపట్టారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని తవణంపల్లి, బంగారుపాళ్యం, ఐరాల, యాదమరి, పూతలపట్టు మండలాల వైకాపా కన్వీనర్లు సిద్ధంపల్లి హరిరెడ్డి, రామచంద్రారెడ్డి, బుజ్జిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, తవణంపల్లి జడ్పీటిసీ భారతి, ఐరాల ఎంపిపి మోహన్, మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, మండల వైకాపా నాయకులు కిషోర్‌కుమార్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

- జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్

చిత్తూరు, మే 18 ప్రభాతవార్త:




జిల్లాలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమం అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ (2026-2027) పుస్తకంను జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రైతులు వర్షాధార పరిస్థితుల్లో రానున్న ఖరీఫ్-2026 నందు వ్యవసాయం చేయదలచిన రైతులకు ప్రకృతి వ్యవసాయం అవలంబిస్తున్న సన్నకారు, చిన్నకారు రైతుల సంక్షేమం దృష్ట్యా రానున్న ఖరీఫ్ సీజన్‌కు ఎల్‌నినో కారణంగా జూన్, జులై, ఆగస్టు మాసాల్లో తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం వుందన్నారు. ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి వ్యవసాయశాఖ సిద్ధం చేసిన ఈ పుస్తకం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ మోహన్ కుమార్, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, ఎపిఎస్ఎన్ఎఫ్ డిపిఎం కె.శివశంకర్, అగ్రికల్చర్ జెడి మురళి, ఉద్యానశాఖఅధికారిరామాంజనేయులు,పశుసంవర్ధకశాఖజెడి ఉమా మహేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అనుమానస్పదరీతిలో వ్యక్తిమృతి

పెద్దపంజాణి మే18 ప్రభాతవార్త:



మండలంలోని బట్టందొడ్డిగ్రామ సమీపంలో ఓ వ్యవసాయ బావిలో ఓవ్యక్తి అనుమానస్పదరీతిలో మృతిచెంది ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు పోలీసుల తెలిపినమేరకు వివరాలిలా..ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ పగడి అనేయువకుడు రామాపురం వద్దగల ఓఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తున్నారన్నారు. ఈ నెల 2వతేదీ తాను తనగ్రామానికి వేళ్ళేందుకు జీతంనగదుసైతం తగీసుకున్నాడని తెలిపారు. అయితే ఏమిజరిగిందో తెలీదుగానీ ప్రశాంత్ పగడి బావిలో శవమై తేలాడు. ఇతనికి మద్యం అలవాటు ఉండటంతో మద్యంతాగి ప్రమాదవశాత్తు బావిలోపడిపోయాడ లేక ఇతరకారణాలేమైనా ఉన్నాయాఅని పోలీసులు దర్యాప్తులోతేలాల్సి ఉంది. పెద్దపంజాణి ఎస్సై మారెప్ప మృతదేహాన్ని పంచనామాకుతరలించి కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

## పెట్రోల్..డీజిల్ ధరలు తగ్గించాలి - ఎమ్మెల్సీ భరత్

కుప్పం, మే 18 ప్రభాతవార్త



రాష్ట్రంలో పెరిగిన పెట్రల్, డీజిల్ ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైకాపా నాయకులతో కలసి ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు ఆయన వినతిపత్రం అందించారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, విద్యుత్, రవాణా చార్జీలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇంధన ధరల పెంపు మరింత భారంగా మారిందన్నారు. రైతులకు వ్యవసాయ ఖర్చులు పెరగడంతో పాటు ఆటో,క్యాబ్, లారీ డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటుందన్నారు. సామాన్య ప్రజలకు మరింత ఇబ్బందులు పెరిగాయన్నారు. వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడంతో పాటు అదనపు పన్నుల భారం ప్రభుత్వమే భరించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు హెచ్‌ఎం మురుగేష్, బాబురెడ్డి, రామకృష్ణ, కౌన్సిలర్లు మోహన్‌రాం, మునిరాజు, రాష్ట్ర వని న్నయకులక్షత్రియ విభాగం అధ్యక్షుడు హెచ్‌ఎం శ్రీను, నేతలు దండపాణి,చంద్రారెడ్డి, చెంగప్ప, ఇలంగోవన్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేగేటు గుండా అమ్మవారి శిరస్సు ఊరేగింపుకై వినతి

కుప్పం, మే 18 ప్రభాతవార్త



కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి శిరస్సు ఊరేగింపును కొత్తపేటకు తీసుకెళ్లేందుకు స్థానిక రైల్వేగేటు గుండా అనుమతిం చాలని రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మహబూబ్ బాషాకు సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థా పకులు డిఎన్ జగదీష్‌బాబు వినతి పత్రం అందించారు. మంగళ వారం మధ్యాహ్నంపైన అమ్మవారి శిరస్సు ఊరేగింపు కొత్తపేటలో ఉంటుందని అక్కడ ఉన్న రైల్వే గేటు మీదుగా వెళ్లేందుకు అనుమతించాలని కోరారు. దీనిపై రైల్వే అధికారులు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## సీనియర్ నేత జయకుమార్‌గౌడ్ మృతి ప్రముఖుల సంతాపం



బైరెడ్డిపల్లి, మే 18 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి మండల సీనియర్ నాయకుడు జయకుమార్ గౌడ్ సోమవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రనాయుడు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, మొగసాల రెడ్డెప్ప తదితర నేతలు జయకుమార్‌గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గృహ గణన వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

శాంతిపురం, మే 18 ప్రభాతవార్త

మండలంలో జరుగుతున్న గృహ గణన వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సెన్సస్ ఆపరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సుప్రత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కార్యాలయంలో ఆయన గృహ , జనగణన సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎడి మాట్లాడుతూ మండలంలో జనాభా, ఇళ్ల గణన 70శాతం పూర్తయిందన్నారు. మిగతా వివరాలు ఈనెల 20లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏ ఇంటిని వదలకుండా తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్, ఎఎస్వో భూపతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## పెంచిన పెట్రోల్, డిజీల్ ధరలు తగ్గించాలి

: మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం, మే 18 ప్రభాతవార్త :




కూటమి ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డిజీల్ ధరలు వెంటనే తగ్గించాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం పెంచిన ధరలను తగ్గించాలని వెదురుకుప్పం కూడలిలో ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామిలను గాలికి వదలి ... ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెట్రోల్, డిజీల్ ధరలు పెరగడం వలన రవాణా ఖర్చులు పెరగడం వలన నిత్యావసర వస్తులు ధరలకు రెక్కలు వస్తాయాని ఈ రోజు రూపాయి వస్తువు ... రేపు పది రూపాయాలు పలుకుతుందన్నారు. కావున కూటమి ప్రభుత్వంకు చిత్తశుద్ధి ఉంటే పెరిగిన ధరలు తగ్గించాలన్నారు. జగనన్న అమలు చేసిన పథకాలను విమర్శలు చేసిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ అమలు చేస్తున్నారని విమర్శంచారు. ఇప్పటి వరకు అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడిచిన పేదలకు, అర్హులకు ఒక్క కొత్త పింఛన్ ఇచ్చారని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు అభివృద్ధి పేరు చెప్పి పేదలకు చేసింది ఏమి లేదన్నారు. ప్రభుత్వంకు చిత్తశుద్ధి ఉంటే పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు పద్మనాభ రెడ్డి, ఎంపిపి బండి నాగరాణి హేసుందర్ రెడ్డి, జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, గంగాధార నెల్లూరు నియోజకవర్గం మహిళ అధ్యక్షులు పుత్తూరు రాధికపురంధర్ రెడ్డి,నాయకులు బట్టే సుబ్రమణ్యం,రామయ్య, డాక్టర్ కోలార్ ప్రకాష్, శివాజీ, భాస్కర్, ధనంజేయులు రెడ్డి, మునికృష్ణా రెడ్డి, పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించడమే ఎన్‌సిసి ముఖ్యఉద్దేశం

చిత్తూరురూరల్, మే 18 ప్రభాతవార్త:



విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వలక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించడమే జాతీయ క్యాడెట్(ఎన్‌సిసి) ముఖ్య లక్ష్యమని 35 బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నోయల్ వివేక్ మోనిస్, లెఫ్టినెంట్ కల్నల్ లోకనాథన్‌లు పేర్కొన్నారు. చిత్తూరుపట్టణం, పివికెయన్ కళాశాల నందు ఎన్‌సిసి విద్యార్థులకు సోమవారం శిక్షణా శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ శిక్షణా శిబిరానికి హాజరైన 572మంది క్యాడెట్లకు పెరేడ్స్, ఆయుధశిక్షణ, డ్రిల్, మ్యాప్‌రీడింగ్, ఫిజికల్ ట్రైనింగ్, యోగా వంటి అంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్లు పికె ప్రసాద్‌రెడ్డి, యుగంధర్, కార్తీక్, అరుణ్ పాండియన్, హేమంత్, జయక్రిట్, శ్రీలత, ఆర్మీ సిబ్బంది సంజయ్‌భట్, రమేష్, నాగార్జున్‌రెడ్డి, సాబు, శివ, వెట్రీరాయన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## భూదానం కార్యక్రమానికి జమీందారు వంశస్తులచే విరాళం

కుప్పం, మే 18 ప్రభాతవార్త



కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి భూదాన కార్యక్రమం కు కుప్పం జమీందారీ వంశస్థులు కేజే బాలాజీ కుటుంబ సభ్యులు విర్నాళ అందించారు. 1.50 లక్షల విరాళాన్ని ఆలయ ఛైర్మన్ బి ఎం కే రవిచంద్రబాబుకు అందజేశారు .అనంతరం వారు అమ్మవారిని దర్శించుకున్నారు .ఆలయ కమిటీ ఛైర్మన్ వారికి అమ్మవారి ప్రసాదాలను అందించారు కార్యక్రమంలో కౌన్సిలర్లు జిమ్ దాము, సురేష్ ,గంగమ్మ గుడి డైరెక్టర్ జయరాం నాయుడు ,వాల్మీకి సంఘ నాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్ విరాళాన్ని అందిస్తున్న దృశ్యం

## రైతులు లాభదాయక పంటలసాగు చేపట్టాలి

- ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, మే 18 ప్రభాతవార్త




రైతులు లాభదాయక పంటలసాగు చేపట్టాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ , ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో సోమవారం కడ సమావేశ హాలులో కుప్పం మండలంలో కొత్తగా ఏర్పాటుచేసిన ఎఫ్‌పిఒ రైతు సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఫార్మమిత్రల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు మంచి అవకాశం అన్నారు. తద్వారా రైతులు ప్రభుత్వ రాయితీలు పొంది ఆర్థికంగా బలోపేతం చెందవచ్చన్నారు. రైతుల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. రైతులు కూడా ప్రకృతి ఆధారిత వ్యవసాయంపై మక్కువ చూపాలన్నారు. పంటలకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. సమావేశంలో కార్పోరేషన్ డైరెక్టర్ శరవణ, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు హైదర్ వలీ, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

## నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

శాంతిపురం, మే 18 ప్రభాతవార్త



మండలంలోని రాళ్లబూదుగూరు పంచాయతీలో రైతు పద్మమ్మ పొలాల వద్ద నూతన 22కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రెస్కో డైరెక్టర్ బసవరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు కుమార్, జయరాజ్, శ్రీనివాసులురెడ్డి, ఎఇ మునిరత్నం, ఎల్ఐ వెంకటేష్, కేశవ పాల్గొన్నారు.

# 23న యాదమరిలో సిఎం చేతుల మీదుగా సంజీవని ప్రాజెక్టు ప్రారంభం

చిత్తూరు, మే 18 ప్రభాతవార్త:



సిఎం నారా చంద్రబాబునాయుడు పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని యాదమరి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 23వ తేదీన సంజీవని ప్రాజెక్టును ప్రారంభిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. యాదమరి సిఎం పర్యటన ఖరారు కావడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు సోమవారం సిఎం పాల్గొనే కార్యక్రమాల స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సిఎం నారా చంద్రబాబునాయుడు బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడనుండటంతో యాదమరి ఎంపిడిఓ కార్యాలయం సమీపంలోని వారపు సంత జరిగే ప్రదేశంలో బహిరంగ సభ నిర్వహించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు స్థలంను పరిశీలించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్, డిఎస్పీ వెంకటనారాయణ, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, తదితరలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు యాదమరి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు చిన్నరెడ్డిపల్లి బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేయనున్న హెలిపాడ్ స్థలం, బహిరంగ సభ ప్రాంగణంను అధికారులు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం పర్యటనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దారు పార్థసారధి, ఎంపిడిఓ వీరేంద్రతో పాటు మండల తెలుగుదేశం అధ్యక్షులు మొరార్జీ, జిల్లా దేశం నాయకులు ఎన్‌పి జయప్రకాష్‌నాయుడు, బంగారుపాళ్యం మండల దేశం అధ్యక్షులు ఎన్‌పి ధరణి, రాష్ట్ర దేశం నాయకులు అమరనాధనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి.

పెద్దపంజాణి మే18 ప్రభాతవార్త:



అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక సిబ్బంది మురగన్,రెడ్డెప్ప రెడ్డి,యోగానంద్ పేర్కొన్నారు.స్థానికపిహెచ్‌సి కేంద్రంలో అగ్నిప్రమాదాల నివారణపై వైద్యాదికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో రోగులను ఎలాకాపాడాలి వారిని ఆస్పత్రులకు ఎలాతరలించాలి అనే దానిపై డెమో నిర్వహించారు.పిహెచ్‌సి కేంద్రాల్లో అగ్నిప్రమాదాల నివారణ పరికరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.కార్యక్రమంలో వైద్యాదికారి మురళి,ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మ, మారెమ్మలను దర్శించుకున్న డిఎస్పీ దంపతులు

పలమనేరు, మే 18, ప్రభాతవార్త:



పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని గంటావూరులో వెలసిన గంగమ్మ, మారెమ్మలను డిఎస్పీ డేగల ప్రభాకర్ దంపతులు దర్శించుకున్నారు. గంటా వూరు బిసి కాలనీలో ఉన్న గంగమ్మ గుడిలో గంగజాతరకు సన్నాహాలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి గంగజాతరకు చాటింపు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీంతో అమ్మ వారి మూల విగ్రహాలను డిఎస్పీ సతీ సమేతంగా దర్శించుకున్నారు. చాటింపు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాతర ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అలాగే దప్పు ధ్వనుల మధ్య ఆలయ ఛైర్మన్ డా.మురుగన్, కమిటీ సభ్యులు పసుపు నీళ్ళ కలశాలను ఊరేగించి అమ్మవారికి సంప్రోణక్షణలు చేశారు. ఈ నెల 18న రాత్రి గెరిగ ప్రతిష్ట, గంగచాటు. 25న అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 26న గంగజాతర అమ్మవారి విశ్వరూప దర్శనం, 27 న జలధి ఉత్సవం ఉంటుందని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఛైర్మన్ తెలిపారు.

## పెట్రోలు, డీజల్ ధరలు తగ్గించాలని వైసిపి ధర్నా

### మాటతప్పిన ప్రభుత్వం: మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫైర్

పలమనేరు, మే 18, ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజల్ ధరలు ఇష్టారాజ్యంగా పెంచినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆరోపించారు. పెంచి ధరలను నిరసిస్తూ వైసిసి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అంతకు ముందు సెరికల్చర్ కార్యాలయం నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు వైసిపి శ్రేణులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్యాస్ పెట్రోల్, డీజల్ ధరలు పెంచబోమని ఒక వేళ కేంద్రం పెంచినా ట్యాక్సులు తగ్గించి పెరిగిన ధరలు నియంత్రిస్తామని హామీ ఇచ్చారని ఆరోపించారు. ఐతే కేంద్రం మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తూ ధరలు పెంచుకుంటూ పోతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దేశంలో అన్ని రాష్రాల కంటే మన రాష్ట్రంలోనే పెట్రోలు, డీజల్, వంటగ్యాస్ ధరలు అధికంగా వున్నాయని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఆర్డీఓ భువనేశ్వరికి అందజేశారు. పలమనేరు, బైరెడ్డిపల్లె నాయకులు మొగసాల క్రిష్ణమూర్తి, మొగసాల రెడ్డెప్ప,హేమంత్‌కుమార్‌రెడ్డి, చెంగారెడ్డి, బాలాజీనాయుడు, కమాల్‌బాషా, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించండి.!

### జిల్లా సహిత విద్య సమన్వయకర్త డి.చంద్రశేఖర్

రామచంద్రాపురం, మే 18 ప్రభాతవార్త:



దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త డి.చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఆర్‌సి పురం ఎస్టీ కాలనీ , గెరికచేను పల్లి, బలిజపల్లి గ్రామాలలో దివ్యాంగ పిల్లల ఇంటి వద్దకు వెళ్ళి బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా ఆయన దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. వారికి విద్య నేర్పించి సమాజంలో విలువలను తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయుడు కె.మనోహర్, ఐఈఆర్‌పి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం నిరసన



పుత్తూరు రూరల్, మే 18 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద పెంచిన పెట్రోల్, డీజిల్ వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని పుత్తూరు సీపీఎం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రజలపైన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, పెంచి ప్రజలపై భారాలు మోపడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ధరలు పెరడం వల్ల నిత్యావసర దారులు కూడా పెరిగిపోతున్నదని, సామాన్యమైన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు, వంట గ్యాస్‌ధరలు వెంటనే డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, విజయ్, యాషన్ బాషా, కుమార్, కృష్ణమూర్తి, దేవారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

### సోషల్ మీడియా ఉద్యమం

చంద్రగిరి, మే 18 ప్రభాతవార్త:



రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన సోషల్ మీడియా ఉద్యమానికి విశేష స్పందన లభిస్తున్నది. సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది తమ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏఈసిఈఎ జి-3045 యూనియన్ మే డే రోజున సోషల్ మీడియా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి డివిజన్, సబ్ డివిజన్ స్థాయిలో విజయవంతంగా నిర్వహిస్తూ కార్మికులలో చైతన్యం నింపుతున్నది. ఈ క్రమంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు పోస్టులు పంపించి వారి సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు. విద్యుత్ సంస్థలో మూడవ పార్టీ విదానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. తమ ప్రధాన డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ పెద్దఎత్తున ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు లోకనాథం, లతీష్, బి.దొరబాబు, హరినాద్ రెడ్డి, మధు, ఎం.శ్రీనివాస్, వేదమూర్తి, రాజు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్‌ధరలు తగ్గించాలంటూ వైసీపీ నాయకులు నిరసన

కేవీబీ పురం, మే 18 ప్రభాతవార్త:




పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని వైసీపీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన కేవీబీ పురంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఎదుట మండల వైసీపీ కన్వీనర్‌గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ నూకతోటి రాజేష్ ఆదేశాల మేరకు ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలంటూ సీఎం డౌన్..డౌన్...అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డీజిల్ పెంచడంతో ప్రజలపైన ఇబ్బందికరంగా ఉందని తక్షణం తగ్గించాలంటూ డిమాండ్ చేశారు. లేకుంటే ధర్నా కార్యక్రమం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం కేవీబీ పురం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించి, పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, సరస్వతి రమేష్ లాల్, పూడి మణి, రాముడర్మ, సర్పంచ్ గిరి, పాతపాళెం హరి రామారావు, వైసీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా శివాలయంలో వాస్తు శాంతి, అంకురార్పణం

పుత్తూరు రూరల్, మే 18 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా సోమవారం ఆలయంలో ఉదయం విఘ్నేశ్వర పూజ అభిషేకం, అలాగే ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ కామాక్షిదేవికి శ్రీ సదాశివేశ్వర స్వామికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. 10 గంటలకు గోపూజ కార్యక్రమం, రాత్రి వాస్తు శాంతి అంకురార్పణం మృత్యాగ్రహణం శ్రీవినాయక స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి, అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

**న నేడు ఆలయంలో...**

శ్రీ కామాక్షి సమేత, శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా మంగళవారం ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, రాత్రి ధ్వజారోహణం, అలాగే చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం, మే 18 ప్రభాతవార్త:

విజయపురం ప్రభుత్వ ఐటీఐలో 2026-27 సంవత్సరానికి మొదటి విడత ఐటీఐ కోర్సుల అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.భైరవుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారాలను వచ్చే నెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో సమర్పించుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు సర్టిఫికెట్స్ నకలు కాపీలతో పాటు ఫోటో జత చేసి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థి 30 తేదీ లోపు ఐటీఐ విజయపురం లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. కౌన్సిలింగ్ కన్వీనర్ ఐటీఐ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ చిత్తూరులో ఆగస్టు 8 నుంచి 15 తేదీ వరకు మెరిట్ ప్రతిపాదికన అడ్మిషన్స్ జరుగుతాయన్నారు. ఎటువంటి ఇంటర్వ్యూ కార్డులు పంపబడవని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు 8639790174, 9502572159, 6303156450, 9494434236, 9177035120, 9885320544 సంప్రదించాలన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



విజయపురం, మే 18 ప్రభాతవార్త:

నగరి మున్సిపాలిటీకి చెందిన ఏ.పి.కృష్ణన్‌కు 40 వేలు, ఎస్.కలేషాకు 1,03,734లు, కె.జె.గోపినాథ్‌కు 77,797లు, ఎస్విన్ సాయికి 23,800లు, మూలనత్తంకు చెందిన మునస్వామికి 30,345లు, అలాగే విజయపురం మండలంకు చెందిన డి.జయలక్ష్మికు 40,295 రూపాయలు, హేమలతకు రూ.20,541లు, కె.భారతికి రూ.26,240లు, సి.సుందరికి రూ.14,114లు, కె.గుణశేఖర్‌కి రూ.40,306 రూపాయలు, నింద్ర మండలం నెట్టేరికి చెందిన ఎం.జగన్నాథంకు రూ.66,999ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నగరి పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు.

# తిరుపతి డివిజన్

## పెట్రోల్, డీజల్ ధరల పెంపుపై వైయస్సార్‌సిపి అందోళన

### -తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా

తిరుపతిరూరల్, మే18 ప్రభాతవార్త:



పెరుగుతున్న ఇంధన ధరల భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరించాలని వైయస్సార్‌సిపి తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి భూమన అభినయ్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెంచిన ఇంధన ధలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ విపక్షం ఆరోఫణలు ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో పెట్రోల్, డీజల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఆ దిశగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. మేము అధికారంలోకి రాగానే ఇంధన ధరలు తగ్గిస్తామన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో ఇతర రాష్ట్రాలతో పోల్చుతూ ఇంధన ధరల వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించిన విషయాన్ని గుర్తు చేశారు. వ్యాట్ 50శాతం తగ్గిస్తామన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న నేపథ్యంలో యుద్ధప్రభావం ఉన్నప్పటికీ, గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం పెట్రోల్‌పై 31శాతం, డీజల్‌పై 22శాతం వరకు వ్యాట్ వసూలు చేస్తున్నారని, అదనంగా లీటరుకు రూ.4 రుపాయాలు, రోడ్డు అభివృద్ధి పేరుతో మరోరూ.1రుపాయి వసూలు చేస్తున్నారని ఆరోఫించారు. ఈ పన్నుల నిర్మాణ కారణంగా ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. ఇకపై మరింతగా రూ.10 నుంచి రూ12 రుపాయలు వరకు ధరలు పెరిగే అవకాశం ఉందన్న పుకార్లు ప్రజల్లో అందోళన కలిగిస్తున్నాయన్నారు. ధరలు పెరిగితే నిత్యావసర సరుకుల ధరలపై ప్రభావం పడటంతో పాటు డ్రైవర్లు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని అభిప్రాయపడ్డారు. ఆటో చార్జీలు పెరగడం ద్వారా సామాన్య ప్రజలపై మరింత ఆర్థిక ఒత్తిడి ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో వైయస్సార్‌సిపి ప్రధానంగా మూడు డిమాండ్స్‌చేస్తున్నట్లు తెలిపారు. ఇంధన ధరల భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరించాలన్నారు. వ్యాట్ శాతంపై పున:సమీక్షించాలన్నారు. పెట్రోల్, డీజల్ ధరలను తగ్గించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఇంధన ధరలు రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతాయని, ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వమే భరించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ మేయర్ డాక్టర్ శిరీష, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు రెడ్డి, వైసిపి తిరుపతి అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, ఎస్డీ శేఖర్‌రెడ్డి, పెద్దఎత్తున వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

## సదాశివనగర్‌లో ఐక్యతకు నాంది



తిరుపతిరూరల్, మే18 ప్రభాతవార్త:

తిరుపతి సమీపంలోని ఎస్వీ నగర్‌లోని సదాశివనగర్‌లో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భవించి, సమాజ ఐక్యత, స్నేహభావం, అభివృద్ధి లక్ష్యంగా కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో టిటిడి నుంచి పదవి విరమణ పొందిన దిండుపాటి కుమారస్వామి, ఏపిఎస్ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగి మొహిద్దీన్ భాషాలకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అభినందనలు తెలిపారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించాలని వ్యక్తులు ఆకాంక్షించారు.

## డయల్ యువర్

### ఎస్పీడీసీఎల్ సిఎండికి 52 వినతులు

తిరుపతి,మే 18ప్రభాతవార్త:

ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమానికి 52 వినతులు అందినట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా పలువురు వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 , 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

## ప్రజలకు సత్వర న్యాయం అందించడమే

### పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం ప్రధాన లక్ష ్యం -జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి,మే 18ప్రభాతవార్త:

పలు రకాలుగా అర్జీలతో వస్తున్న బాధిత ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం ప్రధాన లక్ష ్యమని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల స్వీకరణ, సమస్యలపై తక్షణ స్పందించాలని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్‌ఎస్‌కు సుమారు 72 మంది ఫిర్యాదుదారుల నుండి ఎస్పీ సుబ్బరాయుడు వినతులు స్వీకరించి పరిశీలించారు. త్వరిత పరిష్కారానికి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..

## పెట్రోల్ డీజిల్ ధరలపై భారం

### వైసిపి వినూత్నరీతిలో నిరసన ఆటోను లాగిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



చంద్రగిరి, మే 18 ప్రభాతవార్త:

పెట్రోల్ డీజిల్ ధరాభారంపై వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆటోను లాగుతూ వినూతన్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలపై నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమం సోమవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో పెట్రోల్ బంక్‌ల వద్ద నారా లోకేష్ సెల్ఫీ ఫోజుతో అధికారంలోకి వచ్చిన వెంటనే తమిళనాడు తరహా ధరలను అందుబాటులోకి తీసుకువస్తామని నేడు ప్రజలను వంచించారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. పెంచిన ధరలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలనీ, పెట్రోల్ డీజిల్ ట్యాక్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యవసరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు గమనించుకుని సామాన్యుల కోసం నియంత్రణలో పెట్టాలని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు టవర్ క్లాక్ వద్దకు చేరుకోవడంతో క్యాడర్‌లో ఒక్కసారిగా ఉత్సాహం పెల్లుబికింది. ప్రభుత్వానికి, చంద్రబాబుకు, నారా లోకేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు.

# పెట్రోల్ ధరల పెంపుపై... వైసిపి పోరుబాట




సూళ్లూరుపేట, మే 18 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో పెట్రోలు రేటు పెంపుకు నిరసనగా వైయస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో సోమవారం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించి, సూళ్లూరుపేట ఆర్డీవో వి. దేవేంద్రరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న రాష్ట్రంలో ఒక్క సంక్షేమ పథకం అమలు చేసిన ఆనవాలే లేవని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఐదు సంవత్సరాలకు గాను చేసిన అప్పు 3.3 లక్షల కోట్లు అయితే, ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలకే 3,56,455 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరో శ్రీలంకగా మారిందని చెబుతూ, రాష్ట్రంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంపద సృష్టిస్తానని అదే సంపద రాష్ట్ర ప్రజలకు పంచి పెడతానని ముఖ్యమంత్రి చెప్పిన వ్యాఖ్యలు ఏమయ్యా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, పక్క రాష్ట్రంలో రు.103 పెట్రోల్ రేటు ఉంటే మన రాష్ట్రంలో 113 రుపాయిలు పెట్రోల్ రేటు ఉందని, పెట్రోల్ రేటు తగ్గించి ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించాలని, రాష్ట్రంలో రోజుకి డీజిల్‌పై 3కోట్లు, పెట్రోల్‌పై 6 కోట్లు భారం ప్రజలపై పడుతుందన్నారు. పై కార్యక్రమంలో అల్లూరు అనిల్‌రెడ్డి, వి.కృపాకర్‌రెడ్డి, మీజూరు రామకృష్ణారెడ్డి, పముజులవి జయలక్ష్మి, పోలూరు పద్మ, అర్ముగం, జెట్టి వేణు యా దవ్, కలికి మాధవరెడ్డి, తమ్మిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, స్వామిరెడ్డి, చిన్ని సత్యం, చిలక యుగంధర్, తుపాకుల ప్రసాద్ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## గుణపాడు బడి పిలుస్తుంది కార్యక్రమం



చిట్టమూరు, మే 18 ప్రభాతవార్త: ప్రస్తుత నడుస్తున్న విద్యావ్యవస్థలో ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన ఫలితాలు వస్తున్నాయని కార్పొరేట్ స్థాయికి మించిన వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి పవన్ కుమార్ వెల్లడించారు. సోమవారం మండల విద్యాశాఖ అధికారి బివి కృష్ణయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ప్రచార రథాన్ని పచ్చ జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించారు. తిరుపతి జిల్లాలో 36 మండలాలు 36 రోజులు ఇంటింటి ప్రచార రథం కార్యక్రమంలో 21వ రోజు చిట్టమూరు మండలం గుణపాడు గ్రామంలో ప్రచార రథాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు, స్థానికులు మధ్య పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ముందుగా 10వ తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన మండల టాపర్స్‌తో పాటు గునపాడు ఉన్నత పాఠశాలలో 500 పైగా మార్కులు పొందిన విద్యార్థులును జిల్లా విద్యాశాఖ అధికారి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఉప విద్యాశాఖాధికారి సనత్ కుమార్ సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖాది.కారులైన బివి కృష్ణయ్య, బి.భూపయ్య జడ్పిటిసి సభ్యులు చిప్పల వెంకటయ్య, ఎంపిటిసి సభ్యులు పకీరయ్య, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ప్రచార రథం మెట్టు, ఈశ్వరవాక, మన్నెమాల, ఎల్లశిరి, మొలకలపూడి వరకు పర్యటించింది.

## పెళ్లకూరులో గ్రీవెన్స్‌కు అధికారులు డుమ్మా!

**-అధికారుల నిర్లక్ష్యానికి వెలవెలపోతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక -కాళీ కుర్చీలతో స్వాగతం పలుకుతున్న వీఆర్వోల ఛాంబర్లు -మండలంలో 24 గ్రామ పంచాయతీలు గ్రీవెన్స్‌లో వచ్చిన 8 అర్జీలు**



పెళ్లకూరు, మే 18 ప్రభాతవార్త: మండలంలోని సమస్యలు లేనట్టా? ఒకవేళ సమస్యలు ఉన్న పరిష్కారం దొరకదని ఆగినట్టా? మండల కేంద్రమైన పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయం నందు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొన్ని శాఖల అధికారులకే పరిమితమైనది అన్నట్లు కనిపిస్తుంది. సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశగా వచ్చే సామాన్య ప్రజలు అధికారుల డుమ్మాతో నిరాశగా వెనుతిరుగుతున్నారు. ప్రజల సమస్యలను ఆలకించి వాటిని పరిష్కరించిన సంబంధిత అధికారులు దుమ్ము కొట్టడంతో ప్రజలుకు నమ్మకం కోల్పోయి అర్జీలు ఇచ్చేందుకు సైతం విముకత చూపుతున్నారు. మండలంలో వివిధ శాఖలకు సంబంధించిన సుమారు 20 మంది అధికారులు ఉండగా సోమవారం జరిగిన గ్రీవెన్స్ కు ఎనిమిది మంది అధికారులు హాజరు కావడం చూస్తే గ్రీవెన్స్ కార్యక్రమం పట్ల అధికారులు ఎంత శ్రద్ధ చూపుతున్నారో అర్థమవుతుంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక పై ప్రజలు నమ్మకం కోల్పోయి అర్జీలు ఇవ్వడానికి సుముకత చూపడం లేదు ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ఈ గ్రీవెన్స్ డేను సక్రమంగా జరిగేలా చూడాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## నవధాన్యాల సాగుతో...భూమి సారవంతం




తడ,మే 18 ప్రభాత వార్త: పచ్చి రొట్టెఎరువులుగా జీలగ జనముతో పాటు నవధాన్యాలు చల్లి పూత దశలో భూమిలో కలియ దున్నడం వల్ల భూమి సారవంతంగా మారుతుందని తిరుపతి జిల్లా బయో రిసోర్స్ సెంటర్ ఏమ్‌టిసత్య నారాయణ, సూళ్లూరుపేట డివిజన్ ప్రకృతి వ్యవసాయ ఇంచార్జ్ షబీనా రైతులకు తెలియజేశారు. సూళ్లూరుపేట వ్యవసాయ శాఖ ఏడిఏ కాంచన తడ ఏవో కిరణ్ సూచనల మేరకు సోమవారం మాంబట్టు రైతు సేవ కేంద్రం పరిధిలో వెండ్లూరుపాడులో కిషోర్‌రెడ్డి ఇంటి వద్ద బయో రిసోర్స్ సెంటర్ నందు రైతులకు పిఎండిఎస్, నవధాన్యాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశముందని అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అందువలన భూమిని పచ్చదనంతో కప్పి ఉంచేందుకు సారవంతంగా మార్చేందుకు బీడు భూములు నవధాన్యాలు సాగు చేసుకోవాలని అధిక ఉష్ణోగ్రతలు వేడి నేరుగా భూమికి చేరకుండా భూమిలో ఉన్న సూక్ష్మ జీవులు చనిపోకుండా నవధాన్యాల సాగు భూమిని కప్పి ఉంచుతుందని తెలియజేశారు. అదేవిధంగా భూమిలో తేమశాతం ప్రస్తుతం తక్కువగా ఉన్న సీడ్ ఫెర్టిలైజేషన్ విత్తన గుళికలు చేసుకొని భూమిలో చల్లుకుంటే వర్షాలు పడినప్పుడు వెంటనే విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాంబట్టు రైతు సేవా కేంద్రం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ షబీనా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## నివేశన స్థలాల కోసం వినతి



చిట్టమూరు, మే 18 ప్రభాతవార్త: గత ఎన్నో ఏళ్లుగా నివేసిన స్థలాలకు నోచుకోక చెట్లు కింద, పుట్ల కింద తల దాచుకుంటూ జీవనం వెల్లదీస్తున్నామని చిన్నదరఖాస్తు గ్రామానికి చెందిన గిరిజనులు సోమవారం తహసిల్దార్ రామయ్యకు వినతి పత్రం అందించి మొరపెట్టుకున్నారు. గ్రామంలో సుమారు 20 గిరిజన కుటుంబాలు గత 20 సంవత్సరాలుగా అనేక ఒడిదుడుకుల మధ్య జీవనం సాగిస్తూ స్థానికంగా కూలీనాలీ చేసుకోవడంతో పాటు పక్క గ్రామాలకు వెళ్లి వారు తట్ట, బుట్టలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు వారు జీవనం సాగించవలసి రావడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ చిన్నచిన్న గుడారాలు ఏర్పరచుకొని పిల్లాపాపలతో అష్ట కష్టాలు పడుతున్నారు. గత రెండు నెలల క్రితం గ్రామంలోని గిరిజన కాలనీలో పౌర హక్కుల దినోత్సవం జరిపి స్వయంగా పాల్గొన్న తహసిల్దార్ రామయ్య అక్కడ పరిస్థితులను చూసి వారందరికీ నివేసిన స్థలాలను ప్రభుత్వం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ కూడా చిన్నదరఖాస్తు గ్రామంలో గిరిజనులు పాల్పడుతున్న బాధలను గుర్తెరిగి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని గిరిజన సంఘాల నేతల సైతం కోరుతున్నారు.

## ఆటోను ఢీకొన్న కారు




దొరవారిసత్రం, మే 18 ప్రభాతవార్త: మండలం పరిధిలోని సోమవారం అక్కరపాక సమీపంలో సూళ్లూరుపేట నుండి నాయుడుపేటకు పోతున్న ఆటోను వేగంగా వెళుతున్న కారు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలు కావడంతో సులూరుపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి 108 సహాయంతో తరలించారు. ఆటో డ్రైవర్ బందిలి మనోహర్‌కు కాలు విరిగిపోవడంతో నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందిని అభినందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## సూళ్లూరుపేట కేంద్రంగా...రేషన్ మాఫియా దందా!

**- అధికార పార్టీ నేతల అండదండలు - మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**




సూళ్లూరుపేట, మే 18 ప్రభాత వార్త: సూళ్లూరుపేట కేంద్రంగా రేషన్ మాఫియా దందా జరుగుతుందని ఇందుకు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయంటూ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు రేషన్ బియ్యం మాఫియా, ఇసుక తవ్వకాల్లో భాగ స్వాములుగా ఉన్నారని ఆయన ఆరోపించారు. కాళంగి, స్వర్ణముఖి నదులలో ఇసుకను యదేచ్ఛగా త్రవ్వేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని చెప్పారు.తన స్వగ్రామం కాదలూరును రేషన్ మాఫియాకు అడ్డాగా మార్చి అక్కడ నుంచి రేషన్ బియ్యాన్ని తమిళనాడుకుతరలిస్తున్నారని చెప్పారు. ప్రజా సంక్షేమాన్ని, నియోజకవర్గ అభివృద్ధిని పక్కనపెట్టి కేవలం అక్రమార్జనే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. అధికారులకు ఈ తతంగం అంతా తెలిసినప్పటికీ నిమ్మకు నెరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన చెప్పారు. ప్రజలు ఈ అవినీతి భాగవతాన్ని గమనిస్తున్నారని బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని సంజీవయ్య తెలిపారు. అధికార పార్టీ నేతల అవినీతిపై త్వరలోనే వైయస్సార్‌సిపి ఆధ్వర్యంలో ఆందోళనను చేపడతామని ఆయన హెచ్చరించారు.

## డిమాండ్ల సాధలకు ఆర్టీసీ కార్మికుల ఉద్యమం

**- ఎన్ఎంయు రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ విఎస్ బాబు**



వెంకటగిరి, మే 18 ప్రభాతవార్త: ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈ నెల 20, 21 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమం తెలుపుతున్నట్లు ఎన్ఎంయు రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ విఎస్ బాబు తెలిపారు. వెంకటగిరి ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. డిమాండ్లను పరిష్కరించాలని ఆర్టీసీ ఎండీ కూడా వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. అయినా డిమాండ్లను ఇంకా పరిష్కరించకపోవడం వల్ల నిరసన కార్యక్రమం తెలుపుతున్నట్లు చెప్పారు. అప్పటికే ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. పిఆర్‌సిని వెంటనే ఇవ్వాలని, ఆర్టీసీలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. ఎలక్ట్రికల్ బస్సులు పెడితే కార్మికులు ఇబ్బంది పడతారని తెలిపారు. మహిళలను గౌరవప్రదంగా బస్సులు ఎక్కించుకొని గమ్యస్థానాలకు చేరుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీనే ప్రైవేట్ పరం చేయమని రమణ శాఖ మంత్రి ప్రకటించడం హర్షించదగ్గ విషయం అన్నారు. సమావేశంలో ఎన్ఎంయు జిల్లా అధ్యక్షులు డివిఆర్ కుమార్, రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీ కె.వి రత్నం, డిపో అధ్యక్షులు రావు, కమిటీ సభ్యులు ఏ గురవయ్య, ఎస్కే గౌస్ బాషా, డిపి స్వామి, రియాజ్, సురేంద్ర, వెంకటేశ్వర్లు, ఎన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీశ్రీశ్రీ చతుర్భుజ మహాలక్ష్మి బ్రహ్మోత్సవాలు



వాకాడు, మే 18 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు పంచాయతీ పరిధిలోని గొల్ల పాలెం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారికి అత్యంత వైభవంగా ఉత్సవాలు ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఆలయ ధర్మకర్త మాజీ ఏఎంసి చైర్ పర్సన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాపారెడ్డి మనోజ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జరిగే శ్రీశ్రీశ్రీ చతుర్భుజ మహాలక్ష్మి ఆలయం వద్ద విద్యుత్ కాంతులతో రంగ రంగ వైభవంగా అత్యంత వైభవంగా అమ్మవారి ఉత్సవాలకు చేస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి మూత్సవాలు ఏర్పాటులను వాకాడు సీఐ హుస్సేన్ భాష, స్థానిక పోలీసులు పలు సూచనలు సలహాలు మనోజ్ కుమార్ రెడ్డికి తెలియజేశారు. మహాలక్ష్మి అమ్మవారి ప్రాంగణమంతా సీఐ హుస్సేన్ భాష పరిశీలించి ఏర్పాట్లను బందోబస్తు చేపడతామన్నారు.

## ధరలు పెంపు వై.సి.పి., వామపక్షాలు నిరసన



రైల్వే కోడూరు, మే 18 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం పెంచిన డీజల్, పెట్రోల్ ధరలతో ఎ.పి.రాష్ట్ర ప్రజలు కుదేలు అయ్యారని ఇక వాహనాలు నడపటం కష్టం అని ప్రజల ప్రయాణలకు ఇక దున్నపోతు లే దిక్కని వై.సి.పి. రాష్ట్ర అధికార ప్రతినిధి రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కూటమి ప్రభుత్వం తీరుపై విరుచుకు పడ్డారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా వై. సి.పి. అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ ఒడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ర్యాలీ లో బాగంగా రైల్వే కోడూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైసిపి పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు, వామ పక్షాలు కలిసి ధర్నా చేశారు. వైఎస్ ఆర్ కార్యాలయం నుంచి ఆటోకు దున్నపోతును కట్టితో వైఎస్ ఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మిచ్చి మోసం చేసిందన్నారు. ధరలు తగ్గించే వరకు ప్రజల కోసం ప్రజల కొరకు వైసిపిపోరాడుతుందన్నారు. అనంతరం దున్నపోతు ర్యాలీ తో తహసీల్దార్ కార్యాలయంకు వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబుళవారిపల్లి, చిట్వేల్ మండల కన్వీనర్‌లు సాయికిశోర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్జీదారుల సంతృప్తి స్థాయి పెంచేలా సమస్యలు పరిష్కారం

**- జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్**



చిత్తూరు, మే 18 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను అర్జీదారుల సంతృప్తి స్థాయి పెంచేలా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని నూతన సమావేశభవనంలో సోమవారం జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ కరుణకుమారి, కలెక్టరేట్ ఎఓ వాసుదేవన్, చిత్తూరు అర్బన్, రూరల్ తహసిల్దార్లు కులశేఖర్, కళ్యాణిలు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారాలను వేగంగా చేపట్టాలన్నారు.

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 195 సమస్యలు:**

కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల వున్న ప్రజల నుండి సమస్యలపై 195 అర్జీలు అందాయి. ఈ అర్జీలను జాయింట్ కలెక్టర్ పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ, సర్వే శాఖలకు సంబంధించి 150 అర్జీలు, డిఆర్‌డిఎ 15, ఎస్‌పిడిసిఎల్ 7, వాటర్ రిసోర్స్ 6, పోలీసు శాఖ 5, పంచాయతీ రాజ్ 2, సివిల్ సప్లైయిస్ 2, రవాణా శాఖ, విద్యాశాఖ, ఎస్సీ కార్పొరేషన్, జాతీయ రహదారులు, పశుసంవర్థకశాఖలకు సంబంధించి ఒకొక్క అర్జీ అందాయి.

## సూళ్లూరుపేటలో 492వ నేత్రదానం



సూళ్లూరుపేట, మే 18 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవా సంస్థకు సోమవారం 492వ నేత్రదానం అందింది. బాపూజీ కాలనీసుభద్ర రెసిడెన్సీలో నివసిస్తున్న సుంకర సరోజినమ్మ (78) మృతి చెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాల నుండి కార్నియా రికవరీ స్పెషలిస్ట్ డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో కార్నియాలను సేకరించి నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైల్వే వంతెన కింద నీరు.. ఆగిపోయిన బస్సు



కుప్పం, మే 18 ప్రభాతవార్త: కుప్పం పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్థానిక డికెపల్లి రైల్వే వంతెన కింద వర్షపు నీరు చేరి నిల్వ నిలిచింది. దీంతో ఆ మార్గంలో తిరిగే ఆర్టీసీ బస్సు ఉదయమే వ ంతెన వద్దకు వచ్చి ముందుకుసాగలేక ఆగిపోయింది. దీంతో బస్సులోని ప్రయాణీకులు ఎలాగోలా బస్సునుంచి బయటకు వచ్చారు. అనంతరం అధికారులు వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా వర్షపు నీరు నిల్వ లేకుండా రైల్వే, స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అధిక ఉష్ణోగ్రతల పట్ల అప్రమత్తంగా ఉండండి

సూళ్లూరుపేట, మే 18 ప్రభాతవార్త: మే 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రభుత్వ సూచనల మేరకు అధిక ఉష్ణోగ్రతల పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కే చిన్నయ్య సూచించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల మేరకు ప్రజలు ప్రకటించిన ఈ తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అవసరమైతేనే ఇళ్ల నుంచి వెలుపలకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకవేళ బయటకు రావలసి వస్తే గొడుగు గాని టోపీని ఉపయోగించాలన్నారు. కొబ్బరి నీళ్లు, మంచినీరు బాగా తాగాలని, వృద్ధులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని కమిషనర్ కోరారు.

## నేడు శ్రీ తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు

కుప్పం, మే 18 ప్రభాతవార్త: జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ జాతరలో భాగంగా మంగళవారం శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి శిరస్సు ఊరేగింపు కార్యక్రమం జరగనుంది. ఉదయం స్థానిక పాతపేట వద్ద గల పెద్ద బావి వద్ద అమ్మవారి కళ్లకు తెర తొలగించిన అనంతరం అమ్మవారి శిరస్సును ఉదయం ఐదుగంటలనుంచి 24గంటలపాటు కుప్పం పట్టణంలో ఊరేగిస్తారు. తదనంతరం బుధవారం ఉదయం అమ్మవారి శిరస్సు ఆలయంకు చేరుకున్నాక విశ్వరూప దర్శనం ఉంటుంది. అమ్మవారి శిరస్సు ఊరేగింపు, విశ్వరూప దర్శన కార్యక్రమాలకు భక్తులు వేల సంఖ్యలో విచ్చేస్తారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా మొక్కులు కలిగిన వేలాది భక్తులు అమ్మవారికి జంతుబలులిచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

**జిల్లా ఇన్‌చార్జి మంత్రి**

## సత్యప్రసాద్‌కు సాదర స్వాగతం



తిరుపతి,మే 18ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో సోమవారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గోనేందుకు ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విచ్చేశారు. ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, టిడిపి నాయకులు వి.పుష్పావతి యాదవ్, కంకణాల రజనీకాంత్ నాయుడు, బుల్లెట్‌రమణ,కృష్ణయాదవ్, నైనార్ మహేశ్ యాదవ్ తదితరులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి ఆరా తీశారు.టిడిపి పార్టీలో నాయకులతో పార్టీ అంశాలపై చర్చించారు.

## 20న మెడికల్ షాపుల బంద్

వెంకటగిరి, మే 18 ప్రభాతవార్త: డిమాండ్ల సాధనకు ఈనెల 20వ తేదీ అఖిల భారత కెమిస్ట్ సమాఖ్య పిలుపుమేరకు పట్టణంలోని మెడికల్ షాపులను మూసి వేస్తున్నట్లు షాపుల యజమానులు తెలిపారు. ఆన్లైన్లో మందులు అమ్మకాలు నిలిపేయాలని, కార్పొరేట్ సంస్థల అధిక తీసుకోవాలను నిలిపేయాలని, నకిలీ మందులు అమ్మకాలను నివారించాలని తదితర డిమాండ్లకు షాపులు మూసివేసినట్లు వివరించారు. పట్టణంలో పేషెంట్ల కొరకు తీసి ఉంటారని చెప్పారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీకృష్ణుడు



చంద్రగిరి, మే 18 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామ స్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాద్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు ఆంజనేయాచార్యులు, ఘనాపాటి తిరువేంగడం, జమేధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతిలో జిల్లా జైలు!

**-పక్కాభవనాల కోసం కృషి చేస్తా -హోంమంత్రి అనిత**



తిరుపతి,మే 18ప్రభాతవార్త: తిరుపతిలో ఉన్న సబ్‌జైల్‌ను జిల్లాజైలు స్థాయికి తీసుకువచ్చి అందుకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్రహోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తిరుపతిలో జిల్లా జైలు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఇందుకోసం కార్యాచరణ రూపొందించాలని అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. న్యాయస్థానాల సముదాయాన్ని మరోచోటుకు మార్పుచేస్తే ఆ భవనాలను జైలుగా ఉపయోగించుకునే అవకాశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. తిరుపతి సబ్‌జైలు భవనం సామర్థ్యం 120మంది ఖైదీలకు సరిపోయేలా ఉందని, అయితే అదనంగా మరో 20మందిని ఉంచడం శ్రేయస్కరం కాదన్నారు. సామర్థ్యానికి మించి ఖైదీలను ఉంచలేమని, అందుకే పక్కాభవనాన్ని నిర్మించేందుకు సిఎం చంద్రబాబునాయుడుకు, డిసిఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు ఉన్నాయని అనిత తెలిపారు. సోమవారం మధ్యాహ్నం తిరుపతి న్యాయస్థానాల సముదాయం ప్రాంగణంలోని స్పెషల్ సబ్ జైల్‌ను రాష్ట్ర హోం మంత్రి అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు.

## శివయ్య సేవలో హోం మంత్రి



శ్రీకాళహస్తి,మే 18 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుని సోమవారం రాష్ట్ర మంత్రులు దర్శించుకున్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సారధ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయ ఇఓ బికె వెంకటేశులు పర్యవేక్షణలో ఎఇఓ మోహన్,ఎపిఆర్‌ఓ రవిల సారధ్యంలో వేదపండితులతో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆమెకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి, ఇఓ బికె వెంకటేశులు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.ఈ కార్యక్రమాల్లో అధికారులతో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు గుర్రప్పశెట్టి గోపినాథ్, లక్ష్మమ్మ, పార్టీ ప్రముఖులు పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు, పేరం ధనంజయులు నాయుడు, హాజరయ్యారు.ఏర్పాట్లను ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి, ఎపిఆర్ఓ రవిలు పర్యవేక్షించారు. డివైయస్‌పి నరసింహామూర్తి, టౌన్ సిఐ ప్రకాష్‌కుమార్‌లు బందోబస్తును పర్యవేక్షించారు.

# తిరుపతి డివిజన్

## మంగంపేట ముగ్గురాయిని పరిరక్షించుకుందాం

రైల్వే కోడూరు రూరల్, మే 18 ప్రభాతవార్త




రైల్వే కోడూరు నియోజకవర్గంలోని మంగంపేట ముగ్గురాయి కంపెనీని పరిరక్షించు కొందామని ఈనెల 20న చలో ఏపీఎండిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ మురళి అన్నారు. సోమవారం కోడూరు పట్టణంలోని ఏపీ ఎన్జీవో కార్యాలయము నందు మంగంపేట బైరైటీస్ కంపెనీని పరిరక్షించుకుందామని ఆయన తెలియజేశారు. నియోజకవర్గంలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు పై కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని సమస్యను ప్రత్యక్షంగా పోరాటం చేయవలసిన అవసరం ఎంతో ఉందని ఆయన అన్నారు. కోడూరు నియోజకవర్గంలో 175 పైగా పల్వ రైజింగ్ బిల్లులు ఉన్నాయని వీటిలో వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారని ఏపీఎండిసి లో 600 మందికిపైగా ఉద్యోగులు ప్రత్యక్షంగానూ పరోక్షంగాను కొన్ని వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రమంత్రి తో కలిసి ఒక పరిశ్రమను శంకుస్థాపన చేస్తూ రాయలసీమ భవిష్యత్తును తామే మార్చేస్తున్నామని ప్రకటించారని మబ్బుల్లో నీళ్లు చూసి వంతవలక పోసుకోనా అంటూ సినీ కవి రాసిన గేయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రేకులకుంట వెంకటేష్, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర్, మండల అధ్యక్షులు జాన్ ప్రసాద్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కమిటీ సభ్యులు లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితుడికి మానవత సహకారం..

రైల్వే కోడూరు రూరల్, మే 18 ప్రభాతవార్త



రైల్వే కోడూరు మండలంలోని కే బుడుగుంట పల్లి గ్రామంలో ఉన్న తిరుపతి సాంబయ్య క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సమాచారం తెలుసుకున్న మానవత అధ్యక్షులు కె ప్రసాద్ వర్మ సంస్థ తరపున 5000 రూపాయల నగదు చెక్కును బాధితునికి అందజేసినట్లు ఆయన చెప్పారు. అదేవిధంగా పట్టణంలోని శివాలయం వెనుక వీధిలో నివాసం ఉంటున్న ఆవుల వెంకటయ్య కాలేయ వ్యాధితో బాధపడుతున్న సందర్భంలో వైద్య ఖర్చులకు గాను 5000వేల రూపాయలను అతనికి కూడా అందజేసినట్లు ప్రసాద్ వర్మ తెలిపారు. ఇటీవల కాలంలో బాధితులకు అప్పన్న హస్తం అందిస్తున్న మానవతా సంస్థను పలువురు ఘనంగా అభినందిస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎం చంద్రమోహన్ రాజు, డైరెక్టర్ కోటి, ఏ శ్రీనివాసులు, సుభాష్, సభ్యులు మండల రామకృష్ణ, తులసి వెంకటేష్, మునికృష్ణ, రత్నం, సుబ్బరామిరెడ్డి, సిద్దేశ్వర తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులతో మాకేంటి పని.. మేము అనుకున్నది చేస్తాం..!!

కోట్ల భూమిని కట్టబెట్టేందుకు ప్రయత్నం.
రెవిన్యూ తీరుపై గ్రామ యువత ఆగ్రహం.

చిట్వేలి, మే 18, ప్రభాతవార్త:



అది వంద శాతం ప్రభుత్వ భూమి అని తెలిసినా, మా గ్రామ ప్రయోజనాల కోసం కేటాయించండి అని ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో వినతులు సమర్పిస్తున్నా, వాస్తవాలను పరిశీలించాలని ఎమ్మార్వో ను వేడుకుంటునన్నా ఎలాంటి ఫలితం లేదని, అబద్ధపు పత్రాలకు సరేనంటూ, అక్రమ దారులకు వత్తాసు పలుకుతున్నారని మండల పరిధిలోని రాజుకుంట పంచాయతీ అనుంపల్లి గ్రామ యువత మీడియా ముఖంగా వాపోయారు. సోమవారం తాసిల్దార్ స్పందనకు న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు. తదుపరి కార్యాలయం బయట వారు మాట్లాడుతూ మా గ్రామంలో సర్వే నంబర్లు 233,234/4,244.259,209 లో ఉన్న కోట్లు విలువచేసే ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ పార్టీ నాయకుడు ఆక్రమించేందుకు సిద్ధమయ్యారన్నారు. రెవిన్యూ వారిని సంప్రదించి ఆక్రమణ ఆపాలని కోరగా ఎలాంటి ఫలితం లేదని అన్నారు. వాస్తవాలను నిషితంగా పరిశీలించి న్యాయం చేయవలసిన అధికారులు అబద్ధపు పత్రాలకు వత్తాసు పలుకుతున్నారని, పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని అన్నారు. గమనించవలసిన విషయం ఏమంటే గతంలో ఈ భూమి ప్రభుత్వానికి చెందినది అని నిర్ధారించి హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేసిన ఓ అధికారి ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తుండడం, అబద్ధపు పత్రాలకు ఓకే చెప్పడం ఏమిటని యువత తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆ గ్రామంలో ప్రభుత్వ కార్యాలయం నిర్మించాలన్న, పేదలకు ఇళ్ల స్థలాలు కావాలన్నా, పిల్లలకు ఆటస్థలం, శుద్ధి నీటి జలం, దేవాలయాలు, వాటర్ ట్యాంకులు మరియు ఇతర భవిష్యత్తు అవసరాల కోసం గ్రామ సమీపంలో ఎలాంటి ప్రభుత్వ భూమి లేదని ఈ భూమి కేటాయింపులో అధికారులు వాస్తవాలను పరిశీలించి న్యాయం చేయకపోతే గ్రామస్తులతో కలిసి రోడ్లపై బైఠాయింపు చేస్తామని గ్రామ యువత హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం రాజా, ఎన్ మురళి, చింటూ,శ్రీనాథ్, పి వేణు,కె కిషోర్, శ్రావణ్, సురేష్,మావిక్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీభవానీ శంకరుని కళ్యాణం

చిట్వేలి, మే 18, ప్రభాతవార్త:



చిట్వేలి మండల పరిధిలోని,నక్కలపల్లి గ్రామం నందు అవధూత శ్రీరాములు స్వామిచే ప్రతిష్టింపబడ్డ శ్రీ భవాని శంకరుని ఆలయం నందు స్వామివారి కళ్యాణాన్ని గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా ఉదయం అర్చకులు అరవింద శర్మ మూల విగ్రహానికి ప్రత్యేక అలంకారాలు, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం,రాత్రి పెద్ద ఎత్తున అన్నదానం, సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా పండితులు నిర్వహించారు. మద్దిన చంద్రమోళి సుమలత దంపతులు కళ్యాణ ఉత్సవాన్ని,గ్రామ శివాలయం కువైట్ కమిటీ సభ్యులు అన్నదాన దాతలుగా నిలిచారు. గ్రామస్తులు,మండల వ్యాప్తంగా భక్తులు ఈ విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పెద్దలు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

## ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

తాసిల్దార్ యామిని




**ఓబులవారిపల్లి, 18 మే ప్రభాతవార్త** ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజల నుంచి వచ్చి వెనతులు రైతులు సంబంధించిన సమస్యలు శాఖా పరమైన అధికారులు వారం రోజుల్లో సమస్యలు పరిష్కారానికి మార్గాలు చూపే విధంగా చొరవ చూపాలని తాసిల్దార్ యామిని సూచించారు సోమవారం మండల కేంద్రంలోని ఓబులవారిపల్లి తాసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించారు మండల స్థాయి అధికారులంతా గ్రీవెన్స్ డే కార్యక్రమానికి హాజరై శాఖాపరమైన సమస్యలను దగ్గరుండి తెలుసుకొని ప్రజలకు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కరించాలని ఆమె సూచించారు వెంటనే టైం తీసుకుని వాటికి పరిష్కారం మార్గాల చూపుతామన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వర రావు ఎంపీడీవో ఎం వి ఎన్ రాజేంద్ర పిఒపిఆర్డి రామ్మోహన్ రెడ్డి ఆర్ఐ మల్లికార్జున మండల సర్వే నాగలక్షి ్మ అన్ని శాఖల అధికారులు వీఆర్వోలు పాల్గొన్నారు.

## ప్రజావేదికలో 8 మంది వినతులు

కేవీబీ పురం, మే 18 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురంలో సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా కార్యాలయంలో ప్రజా దర్బార్ వేదిక నిర్వహించారు. పలువురు మండల ప్రజలు రెవెన్యూ పరంగా పట్టాలు, భూ సమస్య తదితర వ్యక్తిగత ఇంటి రెవెన్యూ సర్వేలపై వినతి పత్రాలు సమస్యలపై వినతులు అందించడంతో ఇప్పటికప్పుడే సంబంధిత పంచాయతీ వీఆర్‌వోలు, కార్యదర్శుల ద్వారా పరిష్కరించారు. వారం లోపు కొన్ని సమస్యలను పరిష్కారం చేయాలని కేవీబీ పురం తహసీల్దార్ తనూజ ఆదేశించారు. ఎక్కడ తాగునీటి సమస్య, బోర్లు పంచాయతీ మోటార్లు కాని ఎక్కడైనా మరమ్మతులు గురికాకుండా పంచాయతీ కార్యదర్శులు తమ జాగ్రత్తలు తీసుకుని మండల ప్రజలకు దాహార్తిని తీర్చే విధంగా చూడాలని ఎంపీడీవో మాలతి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రజా దర్బార్‌లో తప్పకుండా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులను సైతం తహసీల్దార్, ఎంపీడీవో కోరారు. ఈ ప్రజావేదికలో 4 వినతులకు పరిష్కారం చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఈవోలు లక్ష్మిపతి, రవికుమార్, పంచాయతీరాజ్ ఇరిగేషన్ డీఈలు, ఆర్‌అండ్‌బీ శాఖ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## టీ కల్తీపై టాటా టీ చక్ర గోల్డ్ జెమిని అవగాహన కార్యక్రమం

తిరుపతి విద్య, మే 18 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్‌లో టీ కల్తీపై వినియోగదారుల్లో అవగాహన పెంచేందుకు టాటా టీ చక్ర గోల్డ్ జెమిని ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. కృత్రిమ రంగులు కలిపిన టీ వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రమాదాలను వివరించడంతో పాటు, కల్తీ టీని గుర్తించే ˘చల్లని నీటి పరీక్ష"పై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఇంటింటికీ నిర్వహించిన ప్రచారం ద్వారా రాష్ట్రంలోని 30 వేలకుపైగా కుటుంబాలకు చేరుకుంది. నాణ్యమైన, సురక్షి తమైన ప్యాకేజ్డ్ టీ వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ లక్ష ్యంగా సంస్థ తెలిపింది.

## కాంట్రాక్ట్ ఫ్యాకల్టీని క్రమబద్ధీకరించాలి: డాక్టర్ ప్రహ్లాద రెడ్డి

తిరుపతి విద్య, మే 18 ప్రభాతవార్త



రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఫ్యాకల్టీని ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ ప్రహ్లాద రెడ్డి కోరారు. విద్యా వ్యవస్థను నిలబెట్టడంలో కాంట్రాక్ట్ అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. పదేళ్లకు పైగా సేవలందిస్తున్న అనేక మంది అధ్యాపకులు ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్కువ వేతనాలతోనూ, అనిశ్చిత పరిస్థితుల్లోనూ విద్యార్థుల భవిష్యత్తు కోసం వారు కృషి చేస్తున్నారని కొనియాడారు. విశ్వవిద్యాలయాల్లో బోధన, పరిశోధన, అకడమిక్ కార్యకలాపాలు నిరంతరంగా కొనసాగడంలో కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ ప్రధాన ఆధారమని చెప్పారు. సేవా కాలం, అనుభవం, అర్హతలను పరిగణనలోకి తీసుకుని కాంట్రాక్ట్ ఫ్యాకల్టీని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## వైద్యాధికారి డా. వేణుగోపాల్ రెడ్డికి ఘన సన్మానం

పులిచెర్ల, మే 18, ప్రభాతవార్త



మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా స్థాయిలో పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ప్రథమ స్థానంలో నిలిపి ఉత్తమ ఆరోగ్య సేవలు అందజేస్తున్నందుకు గాను మండల పరిషత్ తరపున పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాభివృద్ధి ఇంకా సాయి శక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ముమ్మరంగా కాజ్ వే నిర్మాణ పనులు

వరదయ్యపాలెం, మే 18 ప్రభాతవార్త



సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కృషితో కాజ్ వే నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కష్టపడి నియోజకవర్గ అభివృద్ధి చెందడానికి చేస్తున్ కృషికి కృతజ్ఞతలు తెలిపారు. వరదయ్య పాలెం మండలం లోని గోవర్ధన పురం కాజ్ వే పనులు చేపట్టాలని గతంలో కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లి తుడా చైర్మన్ వరదయ్య పాలెం మండలంనకు తీసుకొని వచ్చి డ్రైనేజీ, బ్రిడ్జి కి నిధులు కేటాయించాలని సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారన్నారు. ఎమ్మెల్యే కృషితో తుడాలో డ్రైనేజీకి 40 లక్షలు నిధులు కేటాయిస్తే ముందుగా పనులు చేయకుండా కాలయాపన చేస్తూ కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్న తరుణంలో బ్రిడ్జి నిర్మాణ పనులు రద్దు చేస్తామని అనడంతో తెలిపారు. దీంతో తిరిగి నిర్మాణ పనులు మొదలయ్యాయన్నారు. అలాగే గోవర్ధనపురం బ్రిడ్జి వర్షాలకు తీవ్ర అంతరాయము కలుగుతుందని, పరిశ్రమలకు వెళ్ళు కార్మికులు, రద్దీ రవాణా మార్గం కారణంగా నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయండి అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్‌ను వేడుకోగా సమయం పడుతుందన్నారు. దీంతో కనీసం మరమ్మత్తులు చేపట్టండి అని ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌ను కోరారన్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆర్ అండ్ బీ నిధులు ఆరు నెలల కిందట 30 లక్షలు రూపాయలు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఆరునెలల కిందటి నుండి పనులు మొదలు పెట్టకుండా కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిధులు రద్దు చేసి వేరే వారికీ ఇస్తామనడంతో కాంట్రాక్టర్ నేడు పనులు మొదలు పెట్టారు. కష్టపడి నియోజకవర్గం అభివృద్ధి, పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని తపన కలిగిన సత్యవేడు నియోజకవర్గం బిజెపి, జనసేన బలపరిచిన టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెస్తే గొప్పలు మరొకరు చెప్పుకోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. ప్రజలకు మేలు చేయండి, అబద్దాలతో కాలయాపన, భజన ఆపి మీ కష్టం చెప్పుకోండని, ఇతరుల కష్టాన్ని మీ కష్టంగా చెప్పుకోవడం చివరకు ఇంద్రుడు, చంద్రుడు పరిస్థితి రాకుండా నిలబెట్టండని హితవు పలికారు. సత్యవేడు ఎమ్మెల్యే ప్రతినిత్యం ప్రజల పక్షాన పోరాడుతారని జనసేన నాయకులు, చిత్తూరు తిరుపతి జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు, సోషల్ మీడియాలో పెట్టే వ్యక్తులకు తెలియజేశారు. అదేవిధంగా గోవర్ధనపురం టర్నింగ్ నుంచి ఉబ్బల మడుగు వాటర్ ఫాల్స్ చాలా అధ్వానంగా మారింది. ఆ రోడ్డు కూడా మంజూరు చేస్తే బాగుంటుందని తెలియజేశారు.

## ప్రజా పరిష్కార వేదికలో తహసీల్దార్ శివప్రసాద్‌కి పలు వినతులు

సత్యవేడు, మే 18 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా సత్యవేడు రెవెన్యూ కార్యాలయంలో సోమ వారం జరిగిన ప్రజా పరిష్కార వేదికలో ప్రజల నుంచి పలు వినతులు అధికా రులకు అందాయి. ప్రతి సోమవారం జిల్లా కేంద్రం లోను, డివిజన్ స్థాయిలో, మండల స్థాయిల ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో తహసీల్దార్ శివప్రసాద్‌కి పలువురు వినతులు సమర్పించారు. శ్రీసిటీలో కార్మికుల సౌకర్యార్థం ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ, బీజేపీ నాయకుడు బండారు మోహన బాబు వినతి ఇచ్చారు. వంశపారం పర్యంగా సంక్రమించి తన పేరుతోసాగులో ఉన్న 12 సెంట్లు పట్టా భూమిని వెబ్ ల్యాండ్‌లో దేవాలయంగా మార్చడంపై మదనంబేడు రైతు రామచం ద్రయ్య వినతి అందించారు. దీన్ని పరిశీలించి భూ స్వభావాన్ని మార్చాలని ఆయన విన్నవించారు. అలివేలు మంగాపురం గ్రామంలో తన తండ్రి పేరుతో ఉన్న భూమిని ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశారం టూ గ్రామస్తుడు విశ్వనాథన్ తహసీల్దార్ శివప్రసాద్‌కి వినతి అందించారు. ప్రజా పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని ఈ సందర్భంగా తహసీ ల్దార్ శివప్రసాద్ స్పష్టం చేశారు. మండల ప్రజలు కూడా ప్రతి సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న ప్రజా పరిష్కారవేదికను సద్వినియోగం చేసుకుని వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవి, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్, ఆర్ఐ నరేందర్‌రెడ్డి, వీఆర్‌వో వినోద్‌కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల సేకరణకు

ప్రజలు సహకరించాలి : ఇంచార్జ్ తహసీల్దార్ భాస్కర్

చిన్నగొట్టిగల్లు మే 18 ప్రభాత వార్త:



మండలంలో జరుగుతున్న జనాభా లెక్కల సేకరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఇంచార్జ్ తహసీల్దార్ భాస్కర్ కోరారు. సోమవారం మండల పరిధిలోని భాకరాపేట, చెట్టేవారిపాలెం, తిప్పిరెడ్డిగారిపల్లి పంచాయతీలలో జరుగుతున్న జనాభా లెక్కల నమోదు ప్రక్రియను ఆయన ఏఎస్ఒ రమ్యకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ జనాభా లెక్కలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న సిబ్బందికి ప్రజలు సరైన వివరాలు అందించి సహకరించాలని కోరారు. ముఖ్యంగా వలస వెళ్లిన కుటుంబాలు, వృద్ధులు, అర్హులైన లబ్ధిదారుల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలని అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్పందించి జనాభా లెక్కల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భాస్కర్ విజ్ఞప్తి చేశారు.

## పెట్రోల్, డీజిల్ ధరలపై వైసీపీ నిరసన



**సత్యవేడు, మే 18 ప్రభాతవార్త:** పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు సామాన్య ప్రజలపైభారమేనని తిరుపతి జిల్లా సత్యవేడు వైసీపీ నాయకులు బాలాజీరెడ్డి, నిరంజన్‌రెడ్డిలు తెలిపారు. చమురు ధరలు పెంపుపై వైసీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సత్యవేడు పట్టణం వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపు సరికాదన్నారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ హామీ ఇచ్చినప్పటికి అధికారంలోకి రాగానే వాటిని విస్మరించిందన్నారు. దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే అధిక ధరలకు పెట్రోల్, డీజిల్ విక్రయించడం ఏపీ మాత్రమే అన్నారు. డీజిల్ ధరలు పెంపు వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విద్యుత్ చార్జీలు, రవాణా ఖర్చులు పెరిగిపోయి వాటి ప్రభావం సామాన్య ప్రజలపై పడుతుందన్నారు. గత ప్రభుత్వ కాలంలో పెట్రో ధరల అంశంపై తీవ్ర విమర్శలు చేసిన నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలను పెంచడం ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా ప్రజా వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. డీజిల్, పెట్రోల్ ధరల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం పునఃసమీక్షించాలని వారు కోరారు. లేకుంటు ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు నిరంజన్‌రెడ్డి, బాలాజీరెడ్డి, బెల్ట్ రమేష్ తదితరులు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఇంధన ధరలు పెంపుపై వైసీపీ నాయకులు ప్లే కార్డులతో వైఎస్ఆర్ విగ్రహం నుంచి రెవెన్యూ కార్యాలయాలకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఏఏీఎం బుజ్జిరెడ్డి, పామంజి రాజేష్, బాలయ్య, శరవణ, రాబిన్, సుధాకర్, పునీత్‌కుమార్, శేఖర్, మధురాజు, ఆనంద్, కనకరాజు, చెంచయ్య, ఎంపీ రవి, సురేష్, గోపాల్‌రెడ్డి, జీవయ్య, పళణి, ధనపాల్, చంద్రబాబు, ఈశ్వరయ్య, సురేందర్‌రెడ్డి, నాగరాజు దయాల్, ఇస్మాయిల్, రాహుల్, మహిళా నాయకురాలు మస్తాన్‌భేగం, శాంతిలక్ష్మి తదితరులు ఉన్నారు.

## 24 వరకు వార్డుల పునర్విభజన ముసాయిదాపై

సలహాలు, సూచనల స్వీకరణ కమిషనర్ శారదా దేవి...

తిరుపతి కార్పొరేషన్, మే 18 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం మార్చి 24వ తేదీ జారీ చేసిన జీవో నెంబర్ 570, సిడిఎంఏ వారి ఉత్తర్వుల మేరకు తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 50 ఎన్నికల వార్డులను 66 వార్డులుగా పునర్విభజనకు సంబంధించి ప్రతిపాదిత ముసాయిదాను సోమవారం నుండి ప్రచురించినట్లు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డుల సరిహద్దులతో కూడిన ప్రతిపాదిత ముసాయిదాను అధికారికంగా ప్రచురించి, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ ముసాయిదాను రూపొందించినట్లు పేర్కొన్నారు. ముసాయిదాపై ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఏవైనా ఉంటే ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నగరపాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంకు వ్రాతపూర్వకంగా సమర్పించాలని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) ఆ ప్రకటనలో కోరారు.

## నగరపాలక సంస్థకు 42వినతులు

డిప్యూటీ కమిషనర్ అమరయ్య

తిరుపతి కార్పొరేషన్, మే 18 ప్రభాతవార్త:



నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదికకు 42 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక కార్యక్రమా లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 26మంది వినతులు సమర్పించగా, 15మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తాతా నగర్ నందు అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేస్తున్నారు అడ్డుకోవాలని, లీలామహల్ సమీపంలోని పిఎస్ 4 వద్ద రోడ్డు సైడ్ అక్రమ నిర్మాణలను పరిశీలించాలని, ప్రగతి నగర్ లో రోడ్డు పైన బోర్ వేస్తున్నారు పరిశీలించాలని, పడిపోయేందుకు సిద్ధంగా ప్రమాధాకరంగా ఉన్న చెట్టు తొలగించాలని, మధురా లాడ్జి నిర్మించి 56సంవత్సరాలు అవుతున్నది పునర్నిర్మానికి అనుమతి ఇవ్వాలని, గొల్లవానిగుంటలో బోటింగ్, సుందరీకరణ చేయాలని, వరదరాజ నగర్ నందు వర్షపు నీరు ఆగిపోతున్నది వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని, అంకుర హాస్పిటల్ రోడ్డు నందు చెట్లకు నీరు పట్టాలని, చెత్త శుభ్రం చేయాలని, వైకుంతపురం వద్ద కాలువలు మారమ్మత్తులు చేయాలని కోరారు. భూగర్భ డ్రైనేజి మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

## కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆదుకోండి



**వరదయ్యపాలెం, మే 18, ప్రభాతవార్త** తిరుపతి జిల్లాలోని వరదయ్యపాలెంకు చెందిన కుమారుడు తిరుపతి మాదన చరీష్ (16) ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 557/600 మార్కులు సాధించాడు. అయితే ఈ విద్యార్థి కిడ్నీ సమస్యతో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో దయాలసిస్ వైద్యం చేసుకుంటున్నాడు. ఈ అబ్బాయి తండ్రి మాదన తిరుపతి (53) ప్రయివేట్ సంస్థలో ఓ చిన్న ఉద్యోగం చేస్తూ వున్నాడు. నెలకు 11000వేలరూపాయల జీతంతో కుటుంబాన్ని పోషిస్తూ వున్నాడు.ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితిలో తన కుమారుడు చికిత్సకు అవసరంమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. అందువల్ల దాతలు మాదన శ్రీనివాసులు ఫోన్ పే/ జి పే 9840115015కు, లేదా బ్యాంకు అకౌంట్ మాదన శ్రీనివాసులు ఏ /సి నెంబర్ 801910110001575 బ్యాంకు అఫ్ ఇండియా, ఉస్మాన్ రోడ్ చెన్నైకు సాయంఅందించాలని కోరారు.

